క్లుప్తంగా

నేడు సమన్వయ కమిటీ సమావేశం

పెనుగంచిప్రోలు: ఫిబ్రవరి 5 నుంచి 9వ తేదీ వరకు లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం, పెద్ద తిరునాళ్ల నిమిత్తం గురువారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జీవీడీఎల్ లీలాకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ ఆర్డీవో ఆదేశాల మేరకు సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చిన్నబాబు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోడి పందేలు, పేకాట, తదితర క్రీడలను నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలోని చిల్లకల్లు, అనుమంచిపల్లి, బూదవాడ, గండ్రాయి, తిరుమలగిరి గ్రామాల్లో గతేడాది పందేలు నిర్వహించటంతో ఈ ఏడాది నిఘా పెట్టామని చెప్పారు. గ్రామ మహిళా పోలీసులు కూడా నిరంతర పర్యవేక్షణ చేసి సమాచారం అందించాలని సూచించారు. గ్రామస్తులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

అల్లూరు(వీరులపాడు): హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా జోనల్ సూపర్‌వైజర్ సుందర్‌రావు అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో బుధవారం హెచ్‌ఐవీపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వెంకట్రావమ్మ, గౌతం, జ్యోతి, వెంకటరెడ్డి, చంద్రశేఖర్, దివ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



షేర్‌మహ్మద్‌పేట (జగ్గయ్యపేట): గండ్రాయి, వల్లభి వెళ్లే రహదారి మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రహదారి మీదుగా నిత్యం ప్రజలు తెలంగాణాకు రాకపోకలు సాగిస్తుంటారు. కొంత కాలంగా రోడ్డుపై గుంతలు పడి అధ్వాన్నంగా మారింది. దీంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను రహదారి మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించటంతో మెయింటినెన్స్ నిధులు రూ.2 లక్షలు కేటాయించారు. దీంతో 10 కి.మీల మేర రహదారి మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనులను ఆర్అండ్‌బీ జేఈ నరేంద్ర పర్యవేక్షిస్తున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

వీరులపాడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌ఐ సోమేశ్వరరావు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వీరులపాడు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను మంగళవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించటం వల్ల భవిష్యత్తులో ఉద్యోగావకాశాలలో సైతం ప్రాధాన్యం ఉంటుందన్నారు. ముఖ్యంగా పోటీలను స్నేహపూరిత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కన్నమాల సురేష్, మాజీ సర్పంచ్ వట్టికొండ చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యుడు ప్రకాశరావు, వార్డు సభ్యుడు మందూరి గోపి, క్రీడాకారులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన కేవీఆర్ క్రీడాకారులు



నందిగామ: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక కాకాని వేంకటరత్నం కళాశాల క్రీడాకారులు సత్తా చాటారు. ఇటీవల ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ కళాశాలలో జరిగిన కృష్ణా విశ్వ విద్యాలయం అంతర కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కేవీఆర్ కళాశాల విద్యార్థిని సీహెచ్ భవాని పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో రజత పతకాలు సాధించగా, కె.సందీప్, డి.కమల, బి.ప్రియాంక పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకాలు సాధించారు. వారిని బుధవారం కళాశాల ప్రతినిధులు, పీడీ నాగేశ్వరరావు అభినందించారు.

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు



నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెల్లివిరుస్తున్న సంక్రాంతి శోభ

నందిగామ: ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. నియోజకవర్గవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ సంబరాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సైతం సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్లెటూరి వాతావరణం ఉట్టిపడేలా ప్రత్యేకంగా గుడిసె వేసి, అందమైన ముగ్గులు వేసి, అందులో గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. సంప్రదాయబద్ధంగా పాల పొంగళ్లు పొంగించి, బొమ్మల కొలువులను ఏర్పాటు చేసి, భోగి మంటలు వేసి సందడి చేశారు. మండలంలోని పల్లగిరి, మాగల్లు, రామిరెడ్డిపల్లి, పెద్దవరం, జొన్నలగడ్డ పాఠశాలల్లో కూడా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

చందర్లపాడు మండలంలో...

మండల కేంద్రమైన చందర్లపాడుతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ దుస్తులలో అలరించారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

వీరులపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులు రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం పాలపొంగళ్లు తయారు చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బోయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. వాటిని గౌరవించుకోవటంతో పాటు భావి తరాలకు అందించాలని కోరారు. ప్రతి ఒక్కరు సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వత్సవాయి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం వత్సవాయిలోని శ్రీ అన్నపూర్ణ విద్యాలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆటపాటలతోపాటు విద్యార్థినులకు ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. విద్యార్థినులు రంగు రంగులతో అందంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. సేవ్ గర్ల్ అనే నినాదంతో వేసిన ముగ్గు న్యాయ నిర్ణేతలకు ఆకట్టుకుంది. పాఠశాల కరస్పాండెంట్ వాసిరెడ్డి నరేంద్రదేవ్, ప్రిన్సిపాల్ సిద్ధార్థ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంక్రాంతి రంగవల్లులు

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): గ్రామంలో జగ్గయ్యపేట ఎస్‌జీఎస్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు సేవా కార్యక్రమాలలో భాగంగా బుధవారం వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి రవికుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భూక్యా శ్రీరాములు నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వీరులపాడు పాఠశాలలో పాల పొంగళ్లు తయారు చేస్తున్న విద్యార్థినులు



వీరులపాడు పాఠశాల ఆవరణలో రంగవల్లులు దిద్దుతున్న విద్యార్థినులు



పేట విజ్ఞాన్ స్కూల్‌లో విద్యార్థులకు భోగిపళ్లు పోస్తున్న డైరెక్టర్ తన్నీరు సుధారాణి, ఉపాధ్యాయులు



వత్సవాయిలో సేవ్ గర్ల్ నినాదంతో వేసిన ముగ్గు

పలు విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు

జగ్గయ్యపేట అర్బన్: సంక్రాంతి పండుగ సంబరాలు పట్టణంలో పలు పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విజ్ఞాన్ విద్యా సంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు కన్నుల పండువలా పల్లెటూరి వాతావరణం కళ్లముందు ఆవిష్కారమైనట్లుగా, తెలుగుదనం ఉట్టిపడేలా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు అలరించింది. విద్యార్థులకు భోగిపళ్లు పోశారు. విద్యార్థులు హరిదాసు, బుడబుక్కల, పల్లెపడుచుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గొబ్బిమ్మల పేరంటాలు, చిన్నారులకు బోగిపళ్లు పోయడం, బొమ్మల కొలువు, బోగి మంటలు, పొంగలి తయారుచేయడం కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్థానిక చేగు విద్యాలయంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. ముత్యాల ముగ్గుల్లో గొబ్బిళ్లు పెట్టి విద్యార్థులు ఆట పాటలతో నృత్యాలు చేశారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

సంక్షేమ పాలన సారథి జగన్

ప్రభుత్వ విప్ ఉదయభాను


కన్నెవీడు/ఇందుగపల్లి(వత్సవాయి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలన సారథి అని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. బుధవారం కన్నెవీడులో రూ.30 లక్షలతో నిర్మించిన సొసైటీ భవనం, ఇందుగపల్లిలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతన్నల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉందని రాష్ట్రంలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు అధికమైన ప్రాధాన్యం ఇస్తూ పాలనను ముందుకుతీసుకువెళ్తున్నారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇటువంటి సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందలేదన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా పాటిస్తూ ప్రజలకు అత్యంత చేరువయ్యారన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్ చావా దుర్గారాణి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, మండల పార్టీ అధ్యక్షుడు గాదెల రామారావు, సొసైటీ అధ్యక్షులు వాసిరెడ్డి కృష్ణారావు, కాటేపల్లి రవి, కొండబోలు బ్రహ్మం, రంగిశెట్టి ముత్తయ్య,కనగాల రమేష్, చింతకుంట్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ లావుడియా లక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష, కిలారు హనుమయ్య, మాజీ సర్పంచ్ వాసిరెడ్డి నాగేశ్వరరావు, తహసీల్దార్ వైకుంఠరావు, వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



కన్నెవీడులో సొసైటీ నూతన భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు

నందిగామ: సంప్రదాయం ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని ఆర్డీఓ రవీంద్రరావు హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో డివిజన్‌లో కోడి పందేలు, జూదం వంటివి జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో కోడి పందేలు, పేకాట, జూదం వంటివి జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా బరులు ఏర్పాటుచేసే వారిపై దృష్టి సారించాలన్నారు. సంప్రదాయం ముసుగులో చాలా మంది గాంబ్లింగ్‌లకు పాల్పడుతూ సామాన్యుల జేబులు ఖాళీ చేస్తున్నారని, డివిజన్‌లో అటువంటివి జరుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందన్నారు. ముఖ్యంగా పోలీసులు ఈ విషయంలో కీలక భూమిక పోషించాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ నాగేశ్వర రెడ్డి, డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రరావు

• నందిగామ వీధుల్లో చైనా పతంగులు

సంక్రాంతి పండుగ అనగానే లోగిళ్ల ముందు రంగురంగుల రంగవల్లులు, వాటి నడుమ గొబ్బెమ్మలు, డూడూ బసవన్నలు, హరిదాసుల రాకలు, కోడి పందేలు, గ్రామ కూడళ్లలో చెరుకుగడల విక్రయం వీటన్నింటితో పాటు మరో ముఖ్యమైన విషయం గాలి పటాలు. వివిధ రంగుల్లో, వివిధ ఆకృతుల్లో తయారుచేసిన గాలిపటాలు పిల్లలకు పెద్ద ఆట విడుపు. ఈ ఏడాది నందిగామ మార్కెట్‌లో చైనా పతంగులు హల్‌చల్ చేస్తున్నాయి. ఇవి రూ.50 నుంచి రూ.800 వరకు వివిధ ధరల్లో లభ్యమవుతున్నాయి. – నందిగామ



నందిగామ మార్కెట్‌లో వివిధ ఆకృతుల్లో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న పతంగులు

కలుపు మొక్క యంత్రంపై అవగాహన సదస్సు

జగ్గయ్యపేట: కాయగూర పంటల్లో కలుపు మొక్కలు సులభంగా యంత్రంతో తీయవచ్చని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఆర్.ప్రభావతి అన్నారు. మండలంలోని తక్కెళ్ళపాడు, రామచంద్రునిపేట, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో కలుపుమొక్క యంత్రంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాయగూరల పంటల్లో వచ్చే కలుపును సులువుగా తక్కువ శ్రమ, తక్కువ కాలంలో ఎక్కువ కలుపు తీసే మూడు చక్రాల కలుపు యంత్రం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎక్కువ మంది కూలీలు లేకుండా కలుపు తీసుకోవచ్చన్నారు.దీని ధర కూడా చాలా తక్కువన్నారు. కావలసిన రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త లక్ష్మీకళ, రైతులు పాల్గొన్నారు.

భీమవరం భూ సమస్యను పరిష్కరించాలి

జగ్గయ్యపేటఅర్బన్: వత్సవాయి మండలం భీమవరం గ్రామంలో అసైన్డ్ భూముల సాగుదారులకు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ గ్రామంలోని భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోట కల్యాణ్ మాట్లాడుతూ 1974 లో దళిత పేదలకు ప్రభుత్వం 70.28 సెంట్ల భూమిని అసైన్డు చేసి భూపంపిణీ చేసిందని తెలిపారు. ఈ భూమిని కొందరు ఆక్రమించుకోవాలని చూస్తూ లబ్ధిదారులపై తప్పుడు కేసులు పెడుతున్నారని, ప్రభుత్వం ఇచ్చిన భూముల హద్దులను చూపించాలని, భూములకు రక్షణ కల్పించాలని కోరుతున్నామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జగ్గయ్యపేట మండల నాయకులు కోట కృష్ణ, సీఐటీయూ వత్సవాయి మండల కార్యదర్శి బొడ్డు రాము, భూపోరాట కమిటీ సభ్యులు సోమ రవి, సుబ్బారావు, విమలమ్మ, మేరి, పాపారావు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ మీటింగ్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ప్రత్యేక సమావేశంలో ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం కేటగిరీ నుంచి కోఆప్షన్ సభ్యునిగా వచ్చిన దరఖాస్తుల్లో అభ్యర్థులను ఎంపిక చేసే నిమిత్తం కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం అజెండా సిద్ధం చేసినట్లు తెలిపారు. గతంలో ఉన్న ఇదే కేటగిరిలో ఎన్నికైన చొడవరపు జగదీష్ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో నూతన కోఆప్షన్ సభ్యుడిని ఎన్నిక చేయాల్సి ఉంది. గౌరవ కౌన్సిల్ సభ్యులు, గౌరవ ఎక్స్-అఫిషియో మెంబర్లు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి సాయం

పెద్దాపురం (వీరులపాడు): బాధిత కుటుంబ సభ్యులకు సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక భరోసా కల్పించటం జరుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన బుర్ర ఉద్దండు మట్టి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.10 వేలను బుధవారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

కంచికచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సాధ్యమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్ల గ్రామ సచివాలయం-1 పరిధిలోని ఆరవ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక పక్క రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటంతో పాటు మరో పక్క ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు పాలనను అత్యంత చేరువ చేసిన దార్శనికుడు సీఎం జగన్ అని, అనేక రాష్ట్రాలు ఈ వ్యవస్థలను వారి రాష్ట్రాల్లో కూడా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను గుర్తించి లబ్ధి చేకూరుస్తున్న ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. రానున్న కాలంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందేందుకు సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకువస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, నాయకులు నారిశెట్టి శ్రీనివాసరావు, వంగా శ్రీనివాసరావు, మాగుడుల శంకర్, శేషం వాసుబాబు, వేల్పుల శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, మార్త శ్రీనివాసరావు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా రంజక పాలన

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజా రంజక పాలన సాగుతోందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామంలో బుధవారం రాత్రి ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి పథకాల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా సంక్షేమ పథకాల అమలులో మాత్రం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెనుకడుగు వేయటం లేదన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా సంక్షేమ పథకాలను సమర్థంగా అందించారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంటే ఉన్నారని రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాలలో విజయ పతాకాన్ని ఎగురవేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పెసరమల్లి సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ నెలకుదిటి శివనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు స్టాలిన్, చంద్రశేఖర్, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కంచికచర్లలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు సమస్యలు వివరిస్తున్న మహిళలు

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న సీఎం జగన్

కంచికచర్ల: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో పాలన సాగిస్తున్నారని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కీసర గ్రామ సర్పంచి పేరం నర్సమ్మ అన్నారు. మండలంలోని కీసర గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను బుధవారం ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా పెద్ద మొత్తంలో పింఛన్ నగదు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన పొద్దు పొడవకముందే ఠంఛన్‌గా పింఛన్ నగదు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరిటాల రాము, వేల్పుల రమేష్, పాపట్ల స్వామి, చలమల ప్రభాకర్, వార్డు సభ్యులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.



కీసర గ్రామ సచివాలయంలో నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న సర్పంచి నర్సమ్మ

రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రారంభం

కీసర(కంచికచర్ల): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే కుటుంబానికి ఆసరాగా ఉంటారని, వారి జీవితాలకు భరోసా ఉంటుందని స్వర్ణ టోల్‌ప్లాజా డీజీఎం రాజారావు అన్నారు. మండలంలోని కీసర స్వర్ణ టోల్‌ప్లాజా వద్ద రోడ్డు భద్రతా వారోత్సవాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ముందుగా ట్రాఫిక్ రూల్స్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వాహనదారులు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు విధిగా సీటు బెల్టు పెట్టుకోవాలని, వాహనాలు నడిపే సమయంలో వాహనాలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్లాజా కన్సల్టెన్సీ నాగభూషణం, ఈశ్వరరెడ్డి, సేఫ్టీ అధికారులు శ్రీనివాస్, సెక్యూరిటీ మేనేజర్ ఎడ్డం ఉమామహేశ్వరరావు, బీజేటీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాహనదారులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టోల్‌ప్లాజా డీజీఎం రాజారావు

ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు కౌన్సెలింగ్

నందిగామ: ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని ఎస్‌హెచ్‌ఓ సతీష్ హెచ్చరించారు. స్థానిక మధిర రోడ్డులో బుధవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోవాలాలను గుర్తించి డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. లాభాపేక్షతో ప్రయాణికుల జీవితాలను పణంగా పెట్టవద్దన్నారు. ముఖ్యంగా పొలం పనులకు వెళ్లే కూలీలను ఆటోల్లో కుక్కి మితి మీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూలీలు కూడా ఈ విషయంలో ఆలోచించాలని, ఏదైనా ప్రమాదం జరిగితే, తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. మొదటిసారి కేవలం కౌన్సిలింగ్‌తో సరిపెడుతున్నామని, ఇకపై నిబంధనలు అతిక్రమిస్తే భారీ మొత్తంలో జరిమానాలు వసూలు చేయడంతో పాటు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.



ఆటో చోదకులు, ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌హెచ్‌ఓ సతీష్

ఆకట్టుకున్న అంబేడ్కర్ నాటకం

నందిగామ: పట్టణంలోని గాంధీ సెంటర్‌లో బుధవారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను కళాకారులు కళ్లకు కట్టేలా ప్రదర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పిల్లి జయరాజు, కన్నెగంటి సజ్జనరావు, డీవై దాసు, శేఖర్ బాబులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



అంబేడ్కర్ నాటకంలోని ఓ సన్నివేశం

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com